
ఎన్నికలకు అధికారుల సమాయత్తం

- షెడ్యూల్ విడుదలతో ఏర్పాట్లలో తలమునక
- మలక్‌పేట నియోజకవర్గంలో మొత్తం 300 పోలింగ్ స్టేషన్లు
- వీటికి రూట్‌మ్యాప్ జియోట్యాగ్ పూర్తి
- బీజేపీ, కాంగ్రెస్ టికెట్‌ల కోసం ఆశావహుల యత్నాలు


మలక్‌పేట నియోజకవర్గ ముఖచిత్రం

చాదర్‌ఘాట్: కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడంతో తక్షణం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని అధికారులు స్పష్టం చేశారు. నవంబర్ 30న ఎన్నికలు జరుగుతాయని, డిసెంబర్ 3న ఫలితాలు వెలువడతాయని షెడ్యూల్‌లో ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ నేపథ్యంలో మలక్‌పేట నియోజకవర్గంలో అధికారులు ఎన్నికలకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, పోలింగ్ స్టేషన్‌కు దారి తీసే ప్రాంతాల రూట్‌మ్యాప్‌ను జియోట్యాగ్ చేశారు. నియోజకవర్గ పరిధిలో మూసారాంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట, అజంపురా, చావునీ, అక్బర్‌బాగ్, సైదాబాద్ ఆరు డివిజన్లు, వాటి పరిధిలో 300 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లు 311824. అందులో పురుషులు 158006, మహిళలు 153805, థర్డ్‌జెండర్ 13, సర్వీస్ ఓటర్లు 9, దివ్యాంగులు 957 ఉన్నారు. ప్రస్తుతం నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎంఐఎం పార్టీకి చెందిన అహ్మద్ బలాల ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఇంకా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఆయా పార్టీలు ప్రకటించలేదు. కాంగ్రెస్ నుంచి మాజీ కార్పొరేటర్ చెకొలేకర్ శ్రీనివాస్, బీజేపీ నుంచి సంరెడ్డి సురేందర్‌రెడ్డి, లింగాల హరిగౌడ్ టికెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆధునిక జీవన విధానంతో మానసిక ఒత్తిడి

మలక్‌పేట: ఆధునిక జీవనంతో మునుపెన్నడూ లేని విధంగా మనుషుల్లో మానసిక ఒత్తిడి పెరిగిందని సైకాలజిస్ట్, సోషల్ డెవలప్‌మెంట్ ప్రొఫెషనల్ డాక్టర్ విజయభవాని అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని అనిబీ సెంట్ డిగ్రీ మహిళా కాలేజీలో మంగళవారం సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై విజయభవాని మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఏడుగురిలో ఒకరు మానసిక అనారోగ్యంతో బాధ పడుతున్నారన్నారు. దీనికి ప్రధాన కారణంగా మనం వాడే సెల్‌ఫోన్ అని, దీని వలన సరిగా నిద్ర పోకపోవడం, మనుషుల్లో సత్సంబంధాలు కలిగి ఉండకపోవడమే అని అన్నారు. కాలేజీ సెక్రటరీ డాక్టర్ శ్యామ్ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కౌమర దశలో ఉన్న వారు 20 శాతం మంది మానసిక అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వ్యక్తుల మధ్య సంబంధాలు, మానసిక అనారోగ్యాన్ని దూరం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సైకాలజీ విభాగం హెచ్‌ఓడీ యశోద, లెక్చరర్లు మౌనిక, గాయత్రి, విద్యార్థులు మేఘన, సౌమ్య, సాహితీ, కోమల్, మానస తదితరులు పాల్గొన్నారు.

డీసీ ఆఫీస్‌లోనే నామినేషన్లు అందజేయాలి: ఆర్‌ఓ


వెంకట ఉపేందర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: అసెంబ్లీ ఎన్నికల్లో మలక్‌పేట నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లను నల్గొండ క్రాస్ రోడ్డులోని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ అధికారి కార్యాలయంలో సమర్పించాలని మలక్‌పేట నియోజకవర్గం ఆర్‌ఓ వెంకట ఉపేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన డీసీ కార్యాలయంలో మాట్లాడుతూ, ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలకు, బహిరంగ ప్రదేశాలలో ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. స్థానిక పోలీసు అధికారులతో నియోజకవర్గంలోని పరిస్థితులను గమనిస్తూ ఉంటామని, నిబంధనలను అతిక్రమించే అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అమిత్‌షాకు నేతల స్వాగతం


ఎయిర్‌పోర్ట్‌లో అమిత్ షాకు స్వాగతం పలుకుతున్న జంగం మధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఆదిలాబాద్‌లో నిర్వహించిన బీజేపీ జనగర్జన బహిరంగసభలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు మంగళవారం బీజేపీ నాయకులు బేగంపేట విమానాశ్రయంలో స్వాగతం పలికారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి అమిత్‌షాకు శాలువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన ఐఎస్‌సదన్‌లో మాట్లాడుతూ, అమిత్‌షాను కలవడం వల్ల తనతో పాటు పార్టీ నాయకులు, కార్యాకర్తలకు నూతనోత్తేజం కలిగిందన్నారు.

ప్రతిరోజూ వాహన తనిఖీలు

- చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్‌రెడ్డి



చాదర్‌ఘాట్: ఎన్నికల రోజు వరకు నిత్యం వాహన తనిఖీలు చేస్తామని, వాహనదారులు సహకరించాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశారెడ్డి తెలిపారు. మంగళవారం పీఎస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సాయంత్రం ఆరు నుంచి 12 గంటల వరకు రద్దీ ప్రదేశాల్లో, ముఖ్యమైన కూడళ్లలో వాహనాలు తనిఖీ చేస్తామని తెలిపారు. స్టేషన్ పరిధిలో 24 గంటలూ గస్తీ నిర్వహిస్తామని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రూ. 50వేల కంటే ఎక్కువ వాహనాలలో తరలించవద్దని, ఒకవేళ ఎక్కువగా ఉంటే ఆధారాలు చూపించాలని అన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమైన కూడళ్లలో, సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు వెంటనే చేపట్టాలి

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా దెబ్బతిని ఉందని, ఆయా ప్రాంతాల్లో వెంటనే కొత్త పైప్‌లైన్ పనులు చేపట్టాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. మంగళవారం మోహన్‌నగర్ జలమండలి కార్యాలయం వాటర్ ట్యాంక్ ఆవరణంలో కొత్తపేట డివిజన్‌కు సప్లై అవుతున్న ప్రధాన వాటర్ పైప్‌లైన్ నుంచి నీరు లీక్ కావడంతో ప్రజలకు నీటి సరఫరా నిలిచిపోయింది. పైప్‌లైన్ లీకేజీ వద్ద చేపట్టిన మరమ్మతుల పనులను కార్పొరేటర్ పవన్‌కుమార్, జలమండలి జీఎం బలరామ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, నీటి సరఫరా ఆగిపోవడంతో డివిజన్ ప్రజలు తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నారని, త్వరగా సమస్యను పరిష్కరించాలని జీఎంను కోరారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పైప్‌లైన్లు ధ్వంసమై తాగునీరు కలుషితమవుతోందని, ఆ నీటిని తాగిన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ధ్వంసమైన డ్రైనేజీ పైపులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు డివిజన్‌లోని పలు ప్రాంతాలకు మంజూరైన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ రామకృష్ణారెడ్డి, వాటర్ లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ మెటీరియల్ షాపులో అగ్నిప్రమాదం


అగ్నిప్రమాదం జరిగిన షాపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: మూసి ఉన్న దుకాణంలో అర్ధరాత్రి సమయంలో అగ్ని ప్రమాదం జరగడంతో వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ. 5 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిన ఈ ఘటన మన్సూరాబాద్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మన్సూరాబాద్‌కు చెందిన నారాయణరెడ్డి కొంత కాలంగా మన్సూరాబాద్ చౌరస్తాలో మంగళ సుప్రీం టైలరింగ్ మెటీరియల్ అండ్ టైలరింగ్ షాప్ నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి ఎప్పటి మాదిరిగానే దుకాణాన్ని మూసి ఇంటికి వెళ్లాడు. తెల్లవారుజామున షాపులో నుంచి పొగ వస్తుండగా స్థానికులు గమనించి నారాయణరెడ్డికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఆయన షాపు షట్టర్ తెరిచి స్థానికుల సాయంతోమంటలను ఆర్పివేశాడు. దుకాణంలోని ఫర్నిచర్, టైలరింగ్ మెటీరియల్ కాలిపోవడంతో సుమారు రూ.5 లక్షల నష్టం జరిగి ఉంటుందని నిర్వాహకుడు తెలిపాడు. కాగా, అగ్ని ప్రమాదం జరిగిన షాపు యజమానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. మంగళవారం ఆయన ఘటనా స్థలాన్ని సందర్శించి మాట్లాడారు.

ఫ్లెక్సీలు, హోర్డింగులు తొలగింపు

మీర్‌పేట: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఫ్లెక్సీలు, హోర్డింగులను కమిషనర్ వాణి ఆదేశాల మేరకు సిబ్బంది మంగళవారం తొలగించారు. మీర్‌పేట, జిల్లెలగూడ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, కూడళ్లలో ఏర్పాటు చేసిన పలు రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగించినట్లు తెలిపారు. దాదాపుగా 90 శాతం వరకు తొలగించామని బుధవారం వరకు పూర్తి స్థాయిలో తొలగిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించాలి

కాచిగూడ: బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 63 శాతం బీసీలకు టికెట్లు కేటాయించాలన్నారు. బీసీల డిమాండ్లను రాజకీయ పార్టీలు మ్యానిఫెస్టోలో పెట్టాలని కోరుతూ ఈ నెల 15న కాచిగూడ మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్యహాల్‌లో 'రాష్ట్ర -బీసీ మహాసభ'ను నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్‌ఆర్‌సీపీ రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని సంఘటిత శక్తిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీలను విస్మరిస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

బీజేపీ అధ్యక్షుడిగా విజేందర్

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా విజేందర్‌ను నియమించారు. ఈ మేరకు బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి నియామక పత్రాన్ని విజేందర్‌కు అందజేశారు. తనపై నమ్మకంతో డివిజన్ బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాషాయ జెండాను ఎగురవేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని ప్రకటించారు. కాగా నూతన కమిటీ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌చారి, ఉపాధ్యక్షుడిగా యశ్వంత్‌తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అస్త్రశస్త్రాలతో రె'ఢీ'

- మహేశ్వరంలో ఎన్నికల పోరు
- నియోజకవర్గంలో మొదలైన ఎన్నికల వేడి
- ఊపందుకున్న ప్రచారం
- ప్రచారంతో హోరెత్తిస్తున్న నేతలు


ప్రధాన పార్టీల జెండాలు

మహేశ్వరం: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో మహేశ్వరం నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. గెలుపు వ్యూహాలతో రాజకీయ పక్షాలు సమరానికి సిద్ధమవుతున్నాయి. పార్టీల నేతలు అస్త్రశస్త్రాలతో రెడీ అవుతున్నారు. నియోజకవర్గంలో ఇటీవల తుమ్మలూరు గ్రామంలో సీఎం కేసీఆర్ పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మంత్రి సబితారెడ్డిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. భారీ మెజార్టీతో గెలిపిస్తే మహేశ్వరాన్ని మరింత అభివృద్ధి చేసి మరో హైటెక్ సిటీగా మారుస్తారని సబితారెడ్డి కూడా స్పష్టం చేశారు.

నియోజకవర్గాన్ని చుట్టేసిన మంత్రి

సబితారెడ్డి నియోజకవర్గంలో మూడు నెలల నుంచి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మహేశ్వరం, మన్సాన్‌పల్లి, రావిర్యాల, బండంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో కుల సంఘాలకు స్థలాలు కేటాయించి భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి శంకుస్థాపనలు కూడా చేశారు. నియోజకవర్గానికి వందల కోట్ల రూపాయాలు తీసుకొచ్చి అభివృద్ధి చేశానని, మూడోసారి భారీ మెజార్టీతో గెలిపిస్తారని ఆమె ధీమాతో ఉన్నారు.

కాంగ్రెస్‌లో ఆశావహులు

కాంగ్రెస్ అభ్యర్థిని అధిష్టానం ఇంకా ప్రకటించలేదు. కానీ బడంగ్‌పేట్ మేయర్ పారిజాత, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, ఎనుగు జంగారెడ్డి, అమరేందర్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. మహేశ్వరం, కందుకూరు, తుక్కుగూడ, జల్‌పల్లి, బడంగ్‌పేట్, మీర్‌పేట్, సరూనగర్ డివిజన్లలో మేయర్ పారిజాత ప్రచారం చేస్తున్నారు. ఆశావహులంతా నియోజకవర్గంలో ఆరు గ్యారంటీలతో ప్రజల వద్దకు వెళ్తున్నారు.

తలమునకలవుతున్న బీజేపీ

అభ్యర్థి ఎంపిక విషయంలో బీజేపీ ఇంకా నిర్ణయానికి రాలేదు. పలువురు టికెట్‌ను ఆశిస్తున్నారు. వారిలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఉన్నారు. అయితే శ్రీరాములు, వీరేందర్ గౌడ్ మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందని భావిస్తున్నారు. శ్రీరాములకే టికెట్ ఇచ్చే అవకాశాలున్నాయని కమలనాథులు అభిప్రాయపడుతున్నారు.

సంక్షేమ పథకాలే విజయ పథంలో నడిపిస్తాయి


సమావేశంలో మాట్లాడుతున్న అజిత్‌రెడ్డి

మలక్‌పేట: ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలే విజయ పథంలో నడిపిస్తాయని బీఆర్‌ఎస్ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. మూసారంబాగ్‌లో డివిజన్ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నియోజవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తల సలహాలు, అభిప్రాయాల మేరకు ముందుకు సాగుతామన్నారు. ప్రతీ ఓటరును కలిసి ప్రభుత్వ పనితీరు, పథకాలను వివరించాలన్నారు. ప్రతిపక్షాల కుట్రను తిప్పికొడుతూ పార్టీ గెలుపు కోసం 50 రోజులు కష్టపడి పని చేయాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రజా విశ్వాసం కోల్పోయారన్నారు. మాజీ కార్పొరేటర్లు సామ ప్రభాకర్ రెడ్డి, తీగల సునరితరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అనితానాయక్, వైస్ చైర్మన్ కొరుడు భూమేష్, సినీయర్ నేతలు రాజేశ్వర్‌రెడ్డి, బాబుసుదర్శన్, తెళ్ల మహేష్‌కుమార్, బట్టు దాసురావు, నక్క అమరేందర్‌గౌడ్, లాయక్ అలీ, శ్రీనివాస్‌రెడ్డి, అస్లాం ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు ధర్మేందర్, మోహన్‌రాజ్, సునీత్‌పత్తి, రాధా, కామేష్, నర్సింగ్, టిన్నుసింగ్ పాల్గొన్నారు.

సైదాబాద్ అభివృద్ధికి నిరంతర కృషి


సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

సైదాబాద్: నిరంతరం సైదాబాద్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి అన్నారు. మంగళవారం సైదాబాద్ రెడ్డిబస్తీలో ఆమె జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సైదాబాద్‌లోని పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణలతారెడ్డి మాట్లాడుతూ, అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రభుత్వ పెద్దలు, మలక్‌పేట ఎమ్మెల్యే సహకారంతో సైదాబాద్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుబడుతానన్నారు. కార్యక్రమంలో సైదాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఠాకూర్, విశ్వశాంతి, నందు, పరమేష్, సంపత్‌రెడ్డి, పవన్, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సుజాతా నాయక్

హస్తినాపురం: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని ఆమె అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు క్రీడల్లో రాణించేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. ప్రతి రోజూ ఆటలు ఆడితే మానసికంగా, శారీరకంగా ఎంతో మేలు జరుగుతుందని, విద్యార్థులు చదువుతోపాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రామచంద్రనాయక్, మద్దిలి శివారెడ్డి, మమతా, మల్లేశ్‌గౌడ్, సంగిశెట్టి భవాని, రేణుక, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమరుల స్థూపం నిర్మాణానికి మట్టి సేకరణ


సైదాబాద్‌లో మట్టిని సేకరిస్తున్న సురేందర్‌రెడ్డి

సైదాబాద్: నా మట్టి నా దేశం కార్యక్రమం ద్వారా సేకరించిన మట్టిని దేశ రాజధాని ఢిల్లీలో అమరుల స్థూపం నిర్మాణానికి పంపుతామని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మలక్‌పేట నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్‌లో నా మట్టి- నా దేశం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఆస్మాన్‌ఘడ్ హనుమాన్ ఆలయం నుంచి రెడ్‌క్రాస్ హాస్పిటల్ వరకు ర్యాలీ నిర్వహించి కాలనీల్లోని ఇంటింటికీ వెళ్లి మట్టిని సేకరించారు. అనంతరం సుందర్‌రెడ్డి మాట్లాడుతూ, 75 సంవత్సరాల ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రజలందరిలో దేశభక్తి పెంపొందించేలా అఖండ భారత్ సంకల్పంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన మట్టిని ఒక కలశంలో చేర్చి ఢిల్లీకి పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, కార్పొరేటర్ కొత్తకాపు అరుణ తదితరులు పాల్గొన్నారు.

గుడిసె వాసులకు న్యాయం చేస్తా..


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: రోడ్డు పక్కన గుడిసెలు వేసుకున్న వారికి తగిన న్యాయం చేస్తామని, అప్పటి వరకు వారి నివాసాలను తొలగించకుండా చూస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణలో భాగంగా హయత్‌నగర్‌లోని రేడియో స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి పక్కన గుడిసెలను తొలగించాలనే ప్రయత్నం జరుగుతున్నదని తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. సంబంధిత అధికారి ధర్మారెడ్డికి ఫోన్ చేసి వారి సమస్యను వివరించారు. కొన్ని రోజులు సమయం ఇస్తే వారిని మరో చోటికి తరలిస్తామని, అప్పటి వరకు గుడిసెలను తొలగించరాదని ఆయనను ఎమ్మెల్యే కోరారు. దీంతో గుడిసెల వాసులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

నేటినుంచి శిల్పారామంలో స్టేట్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో


ఎక్స్‌పోలోని వస్తువులు

ఉప్పల్: ఉప్పల్ శిల్పారామంలో బుధవారం నుంచి 14 రోజుల పాటు స్టేట్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్ ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉప్పల్ శిల్పారామంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో జనరల్ మేనేజర్ అంజయ్య మాట్లాడుతూ చేనేత, హస్తకళలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా, చేతి వృత్తిదారులకు ప్రోత్సాహం కల్పించే విధంగా ప్రదర్శన ఉంటుందన్నారు. దాదాపు 120 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భారత దేశ సాంప్రదాయం ఉట్టిపడేలా దేశం నలుమూలల నుంచి వివిధ రాష్ట్రాల కళాకారులు ప్రదర్శనలో తమ ఉత్పత్తులు ఉంచనున్నట్లు తెలిపారు.

• యూటర్న్.. డేంజర్..

రామంతాపూర్ ప్రధాన రహదారిలో ప్రగతి నగర్‌ను ఆనుకొని ఉన్న కట్టమైసమ్మ దేవాలయం పెద్ద చెరువు ఎదురుగా రోడ్డు డివైడర్లను తొలగించి కొత్తగా యూటర్న్ ఏర్పాటు చేశారు. రోడ్డు ఎగుడు దిగుడుగా ఉండటంతో పాటు పెద్ద చెరువు సుందరీకరణలో భాగంగా ఇటీవల గ్రీనరీ కోసం నిర్మించిన డివైడర్ల వద్ద యూటర్న్ తీసుకొని వెళ్లేటప్పుడు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–రామంతాపూర్



క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 13, వంకాయ 48, బెండ 28, పచ్చిమిర్చి35, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 16, క్యారెట్ 33, దొండ 28, ఆలు 21, ఉల్లి 26, గోకర 35, దోస 13, సొర 15, పొట్ల 23, అరటి 09, చిక్కుడు 65, అర్వి 41, మునగ 75, చిలగడదుంప 50, బీట్‌రూట్ 21, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 75, కాప్సికమ్ 55. ఈ ధరలు బుధవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఎల్‌బీనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పంకజ

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజను రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించింది.ఈఆర్‌ఓగా ఎల్‌బీనగర్ సర్కిల్-3 డీసీ రవీందర్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారులుగా ఎల్‌బీనగర్ సర్కిల్-4, సర్కిల్-5 డీసీలు దశరథ్, అరుణకుమారి, సునీతలు నియమితులయ్యారు.ఈ సందర్భంగా పంకజ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నర్సింహ



మలక్‌పేట: బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా (ప్రత్యేక ఆహ్వానితులు) మలక్‌పేటకు చెందిన సీనియర్ నేత బి. నర్సింహ నియమితులయ్యారు. మంగళవారం అక్బర్‌బాగ్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తనను ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మలక్‌పేటలో పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేస్తామన్నారు. ఇలా ఉండగా, నర్సింహ 1982 నుంచి బీజేపీలో వివిధ హోదాల్లో పని చేశారు. బీజేవైఎంలో డివిజన్, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు నిర్వర్తించారు, బీజేపీ నగర కార్యదర్శిగా, మలక్‌పేట కన్వీనర్‌గా, హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్‌గా సేవలందించారు.

సైదాబాద్ డీఐగా అన్వర్‌పాషా



సైదాబాద్: సైదాబాద్ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ)గా షేక్ అన్వర్‌పాషా మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ డీఐగా పని చేస్తున్న రాజేష్ సీబీడీకి బదిలీ కాగా, సీబీడీలో విధులు నిర్వహిస్తున్న అన్వర్‌పాషా సైదాబాద్ డీఐగా బదిలీపై వచ్చారు.

టీబీఎస్ఎస్ఎస్ గ్రేటర్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



నాగోలు: తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా మునిపల్లె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా భాస్కర మూర్తి, కోశాధికారిగా రఘునందన్ నియమితులయ్యారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ మంగళవారం జరిగిన కార్యక్రమంలో వీరిని నియమించారు. ఈ సందర్భంగా సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ, జంట నగరాల్లోని అన్ని అనుబంధ సంఘాలను కలుపుకొని త్వరలో పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. సమాఖ్య ద్వారా భవిష్యత్‌లో బ్రాహ్మణ సంక్షేమ, సేవా కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామన్నారు. రాఘవరావు, వైఎస్ఆర్ శ్రీనివాస్, సుబ్బారావు, లక్ష్మీనారాయణ, వెంకటాప్రగడ సుబ్బారావు, వైష్ణవి క్యాటరర్స్ ప్రసాద్ పంద్రంగి రామకృష్ణ పాల్గొన్నారు.

29న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

వనస్థలిపురం: బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్, వనస్థలిపురం ఆధ్వర్యంలో ఈ నెల 29న వనస్థలిపురంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో 15వ వార్షిక బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక నిర్వాహకులు తెలిపారు. రిజిస్ట్రేషన్లకు ఆఖరు తేదీ ఈనెల 19. వివరాలకు 9848224586ను సంప్రదించవచ్చు.

30 నుంచి వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్

కాచిగూడ: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ నారాయణగూడ బ్రాంచి ఆధ్వర్యంలో ఈనెల 30, 31వ తేదీల్లో 23వ వార్షిక వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్ -2023ను నిర్వహిస్తున్నట్లు వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ప్రిస్టీలీ గైస్ ప్రకటించారు. హైస్కూల్ స్థాయి విద్యార్థినీవిద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 27లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 7032660614.